క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



రామాంజినప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బెత్త రామాంజినప్ప (57) బుధవారం కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై ఓ దాబా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శంకరనారాయణ ఆ గ్రామానికి చేరుకుని రామాంజినప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుమారుడు కోటేశ్వర్ కూడా తండ్రితో పాటు ప్రమాదంలో గాయపడి కోమాలో ఉన్నట్లు గ్రామస్తులు శంకరనారాయణ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ–కేవైసీ చేయించుకోండి

అగళి: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో గతంలో రూ.300 చెల్లించి సభ్యత్వం తీసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని సహకార సహకార సంఘం సీఈఓ బొజన్న ఓ ప్రకటనలో తెలిపారు.

అల్లరి మూకల చేష్టలతో ఇబ్బందులు

చిలమత్తూరు: సార్వత్రిక ఎన్నికల అనంతరం మండలంలోని వీరాపురం పంచాయతీ హుస్సేన్‌పురం గ్రామంలో అల్లరి మూకల చేష్టలు పెరిగిపోయాయి. గ్రామంలో పంచాయతీ బోరుబావి స్టార్టర్‌ను పాడు చేయడం, లేకపోతే ఫ్యూజులు తీసేయడం వంటివి చేస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రతిసారి రిపేరీ చేయిస్తున్నా యథావిధిగా వారు పాడుచేస్తుండటంతో అందరూ ఇబ్బంది పడుతున్నారేని సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి అల్లరి మూకల చేష్టలకు చెక్‌పెట్టాలని గ్రామస్తులు, సర్పంచ్ కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి దారి చూపండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఛత్రం పంచాయతీ పరిధిలోని తులసీదామ వృద్ధాశ్రమానికి దారి చూపాలని ఆశ్రమ వ్యవస్థాపకులు తిమ్మప్ప ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఛత్రం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద 22 సంవత్సరాల క్రితం వృద్ధాశ్రమాన్ని స్థాపించినప్పుడు దారి సౌకర్యానికి ప్రయత్నించగా పక్క భూమి యాజమానికి సర్వే వద్దని చెప్పారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అదే దారిలో ఆశ్రమానికి దాతలు, భక్తులు వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆ దారిని మూసి వేసివేయడంతో అందరూ ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి దారి చూపాలన్నారు.

చిలమత్తూరు ఎస్‌ఐగా మునీర్ అహ్మద్



చిలమత్తూరు: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మునీర్ అహ్మద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాను అరికడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులతో పనులు



పెద్దకోడిపల్లిలో పేడ మోసుకెళ్తున్న విద్యార్థులు

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ముప్పతిప్పలు పెట్టారు. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో బుధవారం విద్యార్థులను వీధుల్లోకి పంపి పేడను మోయించారు. అలాగే పాఠశాలలో రంగుల పేపర్లు కట్ చేయించి అతికించారు. విద్యార్థుల చేత పనులు చేయించడమేంటని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

సీల్డ్ టెండర్లకు ఆహ్వానం

హిందూపురంటౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని వేస్ట్, ఐరన్ మంచాలు, బెడ్ సైడ్ లోకేర్స్ ఇతర వస్తువుల వేలానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ పేర్కొన్నారు. టెండర్ ఫారాన్ని ఆస్పత్రిలోని మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పొందాలని, టెండర్‌ను కొనసాగించే, రద్దు చేసే హక్కు సూపరింటెండెంట్‌కు ఉంటుందన్నారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సీల్డ్ టెండర్లు అందివ్వాలని, 20వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు టెండర్లు తెరుస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.

హర్ ఘర్ తిరంగా సందడి



పరిగి వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పరిగి: హర్ ఘర్‌కా తిరంగ కార్యక్రమంలో భాగంగా ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరవేయాలని సూచించారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన యోధుల జీవితగాథలు వివరించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, తహసీల్దారు హసీనా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: విద్దురాసత్రంలో అమరులైన దేశభక్తులను స్మరించుకుంటూ బుధవారం చౌళూరు గ్రామంలోని స్మారక స్తూపం వద్ద జాతీయ జెండాతో విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు గ్రామ వీధుల గుండా భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్మారక స్తూపం వద్ద అమరవీరుల ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకున్నారు.

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా హిందూపురం మార్కెట్‌లో జాతీయ జెండా రంగులతో ఉన్న దుస్తులు, చేతికి ధరించే బ్యాండ్లు, గాజులు తదితర వాటిని కొనేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపారు.



చేతికి ధరించే బ్యాండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు



జాతీయ జెండా రంగుల్లో అమ్మకానికి ఉంచిన గాజులు



హిందూపురం: అమరవీరుల స్మారక చిహ్నం వద్ద ...

మురుగు సమస్య రాకుండా చూడండి



డ్రైనేజీని పరిశీలిస్తున్న బీసీ శాఖా మంత్రి సవిత

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ: 'రోడ్డుపైనే మురుగు' శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనానికి బీసీ శాఖా మంత్రి సవిత స్పందించారు. అన్ని పార్టీలు, కుల సంఘాల నాయకులతో తన కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ మురుగు నీటిని బ్లాక్ చేయడం సరికాదన్నారు. సంబంధిత భూ యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడే పనులను చేయొద్దన్నారు. అనంతరం బోయగేరి, కుమ్మరిగేరి, ఎస్సీ కాలనీలకు సంబంధించిన డ్రైనేజీ కాలువలను పరిశీలించారు.

మౌలిక వసతులను మెరుగుపర్చండి

- అదనపు జిల్లా జడ్జి శైలజ



పరిగి కేజీబీవీలో మౌలిక వసతులపై ఆరా తీస్తున్న అదనపు జిల్లా జడ్జి శైలజ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని కేజీబీవీని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, కనీస వసతులను మరింత మెరుగుపర్చాలని ఎస్‌ఓ సునీతకు సూచించారు.

పరిగి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం అదనపు జిల్లా జడ్జి శైలజ తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, బాత్రూమ్, లెట్రిన్, తరగతి గదులు, డైనింగ్ హాల్, డార్మెటరీలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు అందించే భోజన నాణ్యతపై ఆరా తీశారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని కేజీబీవీని అదనపు జిల్లా జడ్జి శైలజ బుధవారం సాయంత్రం పరిశీలించారు. విద్యాలయంలోని వంటగది, టాయిలెట్స్, డార్మెటరీస్, తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలపై ఆమె ఆరా తీసారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని, నాణ్యమైన విద్యను అందించాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నీలిమాను ఆదేశించారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి

మడకశిర: నియోజకవర్గంలో వేరుశనగ పంట సాగుకు గడువు ముగియడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టినట్లు ఏడీఏ కృష్ణమీనన్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సబ్సిడీతో ఉలవ విత్తనాలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాలకు 4,251 క్వింటాళ్ల ఉలవ విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

జీఓలను రద్దు చేయండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ: విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన 117, 128 జీఓలను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, చంద్ర, ముత్యాలప్ప, జవ్వాజి నాగరాజు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి సవితకు బుధవారం వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్ నాయకులు సంజీవరాయుడు, చంద్రమౌళి, నీరగంటి అంజినేయులు, రఘునాథరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ గౌరవాధ్యక్షుడిగా నాగరాజు ఎన్నిక

హిందూపురం: మున్సిపల్ ఎంప్లాయిస్, సచివాలయ ఎంప్లాయిస్, మున్సిపల్ వర్కర్స్ జేఏసీ గౌరవ అధ్యక్షుడిగా నాగరాజును ఎన్నుకున్నారు. మున్సిపల్ ఆఫీసులో జేఏసీ అధ్యక్షుడు బండి ఆనందరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ నాయకులు తీసుకొచ్చిన సమస్యలను ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, సిరాల చంద్రలు, సలహాదారులు శోభన్‌రెడ్డి, సుధాకర్, మున్సిపల్ ఉద్యోగులు శంకర్, రాము, భగవంతప్ప, హరినాథ్, సనావుల్లా, జేపీ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డా నాగలక్ష్మి

పావగడ: తాలూకాలోని సీకే పురం గ్రామంలో జిల్లా ఆరోగ్య సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర మహిళా అభివృద్ధి మండలి అధ్యక్షురాలు డా నాగలక్ష్మిచౌదరి పాల్గొని మాట్లాడారు. మహిళలు సామాజిక, రాజకీయ, ఆర్థికంగా ఎదగడానికి మహిళా మండలి మద్దతుగా ఉంటుందన్నారు. పావగడలోని ప్రభుత్వ ఆస్పత్రి, పీహెచ్‌సీలలో రోగులకు అత్యవసర చికిత్స అందుబాటులో లేవని, వైద్యులు సరైన రీతిలో స్పందించడం లేదని మండిపడ్డారు. గ్రామీణ మహిళల సమస్యలపై అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరాం, బీఈఓ ఇంద్రాణమ్మ, సీడీపీఓ సునీత తదితర అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



అమరాపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

అమరాపురం: మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పెనుగొండ డీఎస్పీ ఏ.శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఎస్‌ఐ జనార్ధననాయుడును అడిగి తెలుసుకున్నారు.

జూదరుల అరెస్ట్

అగళి: మండల పరిధిలోని మాధూడి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వీరేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,100 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

అమరాపురంలో భారీ వర్షం

అమరాపురం: మండల పరిధిలో మంగళవారం రాత్రి వాన దంచి కొట్టింది. గత నెల రోజుల నుంచి వర్షం లేకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండు ముఖం పట్టాయి. ఎట్టకేలకు వర్షం కురవడంతో వేరుశనగ సాగు చేసిన రైతులకు ఊరట కలిగింది.

లేపాక్షి ఎంపీడీఓగా నరసింహనాయుడు

లేపాక్షి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా నరసింహనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో లేపాక్షి నుంచి కర్నూలు రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. తాజాగా మరోసారి మండల ఎంపీడీఓగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

దోషుల్ని కఠినంగా శిక్షించాలి

చిలమత్తూరు: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తాలో వైద్య విద్యార్థి హత్య దోషుల్ని కఠినంగా శిక్షించాలని వైద్యాధికారులు రామకృష్ణ, తేజశ్విని డిమాండ్ చేశారు. బుధవారం వారు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రజారోగ్యం విషయంలో నిత్యం శ్రమించే వైద్యులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వైద్యుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

రొళ్ల: గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ప్రత్యేకంగా కృషి చేయాలని ఎంపీడీఓ ఆజాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సర్పంచులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం సర్పంచులకు సర్టిఫికెట్లను అందజేశారు.

ఉపాధి పనులపై సమీక్ష

అమరాపురం: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులపై ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఏఏ గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టారు? పనుల వివరాలు, కూలీల సంఖ్య, వారికి రావాల్సిన బిల్లు తదితర వాటిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం



అలంకరణలో పేట వెంకటరమణస్వామి



గర్భాలయ గోపురానికి మహా కుంభాభిషేకం చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో జీర్ణోద్ధరణ, మహాకుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయంలో విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అభిజిత్ తులాలగ్న పుష్కరాంశంలో మహా కుంభాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ గర్భాలయ గోపుర కలశానికి పూర్ణా కుంభాభిషేకం చేసి పవిత్ర జలాలతో అభిషేకించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలతో ప్రాకారోత్సవం చేశారు.